గురుకులాల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

- గురుకుల బాటలో బీఆర్ఎస్వీ నాయకులు

విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

నిడమనూరు, డిసెంబర్ 4 : గురుకుల పాఠశాలల్లోని వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేశాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి తీరిక లేకుండా పోయిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామి, కార్యదర్శి బొమ్మనబోయిన నాగార్జున అన్నారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల బాటలో భాగంగా బుధవారం మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే, మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలల్లోని వసతి గృహాలను వారు సందర్శించారు. స్టోర్ రూం, వంట గదులు, వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని, మెనూ ప్రకారం పండ్లు పంపిణీ చేయడం లేదని, దుప్పట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదని విద్యార్థులు వారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పురుగుల అన్నం తినలేక విద్యార్థులు పస్తులుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల పరిస్థితిని పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించేవరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి అభినయ్ యాదవ్, నాయకులు కట్ట శ్రీను, షేక్ సలీం, నితిన్ ప్రసాద్, సాయి, రవి నాయక్, శివకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- బీఆర్ఎస్వీ నాయకులు

గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబర్ 4 : ఆదర్శపాఠశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాల, ఆదర్శపాఠశాల, జడ్పీ హెచ్ఎస్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ అమలు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. విద్యార్థులకు నాసిరకం బియ్యం సరఫరా చేయడం వల్లనే ఫుడ్ పాయిజన్ అవుతున్నదని అక్కడికి వచ్చిన సివిల్‌సప్లయ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురైన బాలికలను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాద సుధాకర్‌గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, వంగాల కృష్ణారెడ్డి, దామోదర్, అమరేందర్, రవి పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పిల్లలకు ఆశ్రయం కల్పిస్తే చర్యలు

- జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

నీలగిరి, డిసెంబర్ 4 : జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి హెచ్చరించారు. బుధవారం మహిళా శిశు సంక్షేమ వయో వృద్ధుల దివ్యాంగులశాఖ ఆధ్వర్యంలో బాలల సరంక్షణ కేంద్రాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు చిన్నారులకు అక్రమంగా ఆశ్రయం కల్పించవద్దన్నారు. ప్రభుత్వ అనుమతి తీసుకొని కనీస ప్రమాణాలు పాటిస్తూ కేంద్రాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ చింతకృష్ణ, బాలల పరిరక్షణ అధికారి కాసాని గణేశ్, సభ్యులు భాస్కర్, వెంకన్న, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ హరిత, డీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

కేజీబీవీ వద్ద నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

గుర్రంపోడ్, డిసెంబర్ 4: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, విద్యావనరుల కేంద్రం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇటికాల రమేశ్‌కుమార్ మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి డి.విజయలక్ష్మి, సంఘం అసోసియేట్ అధ్యక్షుడు యాట వెంకట్, సీఆర్పీల సంఘం మండలాధ్యక్షుడు ఎం.రమేశ్, సీఆర్టీలు, సీఆర్పీలు, పీటీఐలు. ఐఈఆర్పీలు, మెసెంజర్లు, నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లగొండను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

7వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నీలగిరి, డిసెంబర్ 4 : నల్లగొండ పట్టణంలోని ప్రతి వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ధాత్రినగర్‌లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ స్కీం-2 ద్వారా రూ. 216 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. అంతకుముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, స్థానిక కౌన్సిలర్ మారగోని భవానీ గణేశ్, కౌన్సిర్లు ప్రదీప్‌నాయక్,

చిన్నాల అలివేలూ జానయ్య, గుండగోని సాయి పాల్గొన్నారు.

కేజీబీవీలో గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు

హాలియా, డిసెంబర్ 4 : హాలియాలోని కస్తూర్బా పాఠశాలలో హిందీ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన మహిళలు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారి కుక్కడాల హైమావతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంపికైన వారు ఈ విద్యాసంవత్సరానికే పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్టీ గురుకులంలో

కొండమల్లేపల్లి : మండంలోని దంజిలాల్ గ్రామ సమీపంలో దేవత్‌పల్లి గేటు వద్ద ఉన్న ఎస్టీ గురుకుల బాలికల పాఠశాలలో గణితం(పీజీటీ), జంతుశాస్త్రం(జేఎల్) పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని గురుకుల ప్రిన్సిపాల్ శారద బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 9న డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా నా యొక్క క్లయింట్ అయిన శ్రీ కందుకూరి సుధారాణి భర్త :లక్ష్మయ్య, వ:54సం||, నివాసం : ఇంటి నెం. 21-300, హుజుర్‌నగర్ శివారు మాధవరాయినిగూడెం మండలం, హుజుర్‌నగర్, నల్గొండ జిల్లా, తెలంగాణ వారి సూచనలు మేరకు సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా !

నా యొక్క క్లయింట్‌కు నల్గొండ జిల్లా, హుజుర్‌నగర్ మండలం, హుజుర్‌నగర్ మున్సిపల్ & రెవిన్యూ పరిధిలోని ఇంటి నెం. 21-300, విస్తీర్ణము : 242 చ||గ|| లు ఇల్లు ఆమే పేరుతో హుజుర్‌నగర్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయం నందు రిజిస్టి కాబడిన గిఫ్ట్ దస్తావేజు నెం.1232/2010 ద్వారా ఆమేకు సంక్రమించియున్నది. నా యొక్క క్లయింట్ తన పనుల నిమిత్తం తేదీ :03.12.2024 సుమారు ఉదయం 11 గంటల సమయంలో నల్గొండకు వెళ్ళినారు. అక్కడ నాగార్జున కాలనీ ఏరియాలో ఆటోలో ప్రయాణించు సమయంలో పైన ఉదహరించిన ఆస్తికి సంబంధించిన (ఒరిజినల్ దస్తావేజు) గిఫ్ట్ దస్తావేజు నెం. 1232/2010 పోగొట్టుకొనియున్నారు. అట్టి దస్తావేజును నా యొక్క క్లయింట్ అయిన శ్రీ కందుకూరి సుధారాణి గారి ఏదేని బ్యాంకులకు గాని, ఆర్థిక సంస్థలకు గాని, వ్యక్తులకు గాని ఏవిధమైన తాకట్టుగాని, కుదవపెట్టుట గాని చేసియుండలేదు.

ఇట్టి దస్తావేజు ద్వారా ఏవరికైనా ఏ విధమైన హక్కులు సంక్రమించియున్న పక్షంలో ఈ క్రింద తెలిపిన చిరునామా సంబంధిత ఆధార ప్రతులతో వారి యొక్క హక్కులు ఈ ప్రకటన వెలువడిన తేది నుండి (7) రోజులలో తెలుపుకొనగలరు. దారిమాల వచ్చిన ఆక్షేపణలు నాయొక్క క్లయింట్‌ను ఏవిధంగా కూడా బాధ్యులు చేయజాలవు. అభ్యంతరములు తెలియజేయవలసిన చిరునామా :

సం||- షేక్ కరీముల్లా, అడ్వకేట్
సాయి అపార్ట్‌మెంట్ ఎదురుగా, భవానినగర్
కోదాడ్ టౌన్, సూర్యాపేట జిల్లా
సెల్ :9705178603

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

మెడికల్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి, డిసెంబర్ 4 : ఈ నెల 7న సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాములునాయక్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం నల్లగొండ మెడికల్ కళాశాల భవనం వద్దకు వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. వైద్య విద్యార్థులతో సీఎం ముఖాముఖి, వైట్‌కోట్ వేరింగ్ సెర్మనీ ఏర్పాట్లపై సూచనలు చేశారు. అనంతరం రైతు బజార్ వద్ద నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం శంకుస్థాపన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్జీ కళాశాలలో జరుగున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లాకు వస్తున్నందున వారి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు.

ఉదయ సముద్రం ప్రాజెక్టు పరిశీలన

నార్కట్‌పల్లి : ఈ నెల 7న బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న దృష్ట్యా ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి డెలివరీ చానల్ ద్వారా నీటిని వదిలేందుకు చేసిన ఏర్పాట్లు, పైలాన్, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 7న మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్ ద్వారా ముఖ్యమంత్రి బ్రాహ్మణ వెల్లెంలకు చేరుకుంటారని తెలిపారు. ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం దామరచర్ల మండలం వైటీపీఎస్ యూనిట్ -2ను, జిల్లా కేంద్రంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభిస్తారని, నర్సింగ్ కళాశాలకు, మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఎన్‌జీ కాలేజీ మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. నల్లగొండ ఇన్‌చార్జి ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ సీఎం రాక సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఇరిగేషన్ సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలుపుదల

కొండమల్లేపల్లి, డిసెంబర్ 4 : దేవరకొండ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఐదు పత్తి మిల్లుల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పత్తి నిల్వలు పేరుకుపోయినందున పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సీసీఐ బయ్యర్ శ్రీనివాసరావు, మార్కెట్ కార్యదర్శి కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి కొనుగోలు చేసే తేదీలను ప్రకటించే వరకు రైతులు మిల్లులకు పత్తి తీసుకు రావద్దని సూచించారు.

లక్ష్మమ్మ కుటుంబానికి చిరుమర్తి పరామర్శ

కట్టంగూర్, డిసెంబర్ 4 : మండలంలోని మునుకుంట్ల గ్రామానికి చెందిన పోషబోయిన లక్ష్మమ్మ అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గ్రామానికి వెళ్లి లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, రమేశ్, నాయకులు ఉన్నారు.

హెచ్ఐవీ బాధితులకు విరాళాల సేకరణ

నార్కట్‌పల్లి, డిసెంబర్ 4 : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కామినేని వైద్య కళాశాలలో చారుమతి కేర్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఎయిడ్స్ బాధితుల కోసం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్లు మహేశ్, దిత్యకృష్ణ, రాధికా మిత్ర, పీఆర్ఓ చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, గణేశ్ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ డీఎంగా సువిన్ కుమార్

నల్లగొండ, నవంబర్ 4: భారత ఆహార సంస్థ ఉమ్మడి నల్లగొండ డివిజినల్ మేనేజర్‌గా సువిన్ కుమార్ బుధవారం జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అరుణాచల్ ప్రదేశ్ నుంచి సువిన్‌కుమార్‌ను నల్లగొండకు బదిలీ చేసింది. దాంతో ఆయన ఇన్‌చార్జి డీఎం హరాసింగ్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఏజీఎం రాఘువేంద్ర సింగ్‌తో పాటు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

టీపీయూఎస్ మండల కార్యవర్గం

మర్రిగూడ, డిసెంబర్4 : మండలకేంద్రంలో బుధవారం జరిగిన టీపీయూఎస్ సమావేశంలో సంఘం రాష్ట్ర బాధ్యుడు పొనుగోటి రవీందర్‌రావు సమక్షంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా ఎం.శ్రీరమణ, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా బి.శంకరయ్య, కోశాధికారిగా డి.ప్రవీణ్ కుమార్, కార్యదర్శిగా జి.వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎంఈఓ బిట్టు శ్రీనివాస్‌ను కలిసి కార్యవర్గం జాబితాను అందించారు.

ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి

నకిరేకల్, డిసెంబర్ 4 : జీఓ 81లో మిగిలిపోయిన వీఆర్ఏలకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ వీఆర్ఏలో బుధవారం బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 మంది వీఆర్ఏల వారసులకు అర్హత ప్రకారం ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. తమ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రవి, వీరయ్య, సుధాకర్, ఎల్లేశ్, యాదగిరి, జానిమియా, ఉపేందర్ ఉన్నారు.

దర్వేశిపురం ఆలయం వద్ద దుకాణాలకు టెండర్లు

నల్లగొండ సిటీ, డిసెంబరు4 : దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద పలు దుకాణాల నిర్వహణకు బుధవారం ఆలయ అధికారులు టెండర్లు నిర్వహించారు. కొబ్బరికాయలు, లడ్డూ పులిహోర విక్రయానికి, ఫొటో స్టూడియోకు టెండర్లు నిర్వహించారు. లడ్డూ, పులిహోర విక్రయ దుకాణానికి రూ.11.85 లక్షలకు, ఫొటో స్టుడియోకు రూ.63 వేలకు టెండరు దారులు దక్కించుకున్నారు. కొబ్బరికాయల విక్రయానికి సరైన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ జయరామయ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రంగౌడ్, నాగేశ్వరావు, కార్యనిర్వహణ అధికారి నిఖిల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, డిసెంబర్ 4 : మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సాయిబాబా కల్యాణమండపంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రుణాలకు సంబంధించి రూ.178కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగుల వంచ వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం నరహరి, సీసీ కొండ మట్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

కట్టంగూర్ : మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి మంజూరైన ప్రభుత్వ చౌకధరల దుకాణాన్ని బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, మాజీ సర్పంచ్ మేడే రేణుక పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబర్ 4: గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి అధికారులు, ఎంఈఓలు, గురుకులాల ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలలను, హాస్టళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు సరైన ఆహారం అందించకపోయినా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచక పోయినా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తాసీల్దార్ హరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

తేమపేరుతో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, డిసెంబర్ 4 : తేమ పేరుతో పత్తి రైతులను ఇబ్బంది పెడితే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కొంపెల్లి సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు మారిని నేపథ్యంలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన పత్తిలో తేమశాతాన్ని పరిశీలించి వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. రైతులకు మద్దతు ధర అందేలా చూడాలన్నారు. అనంతరం మండలంలోని పులిపలుపుల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ. 20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి, బీరెల్లిగూడెంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, కొరటికల్ గ్రామంలో 33/11కేవీ సబ్‌స్టేషన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలు విద్యా వ్యవస్థకు మూల స్తంభాలు

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, నవంబర్ 4: బీఈడీ కళాశాలలు విద్యా వ్యవస్థకు మూల స్తంభాలని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎంజీయూలో ఉమ్మడి జిల్లా శిక్షణ విద్యా సంస్థల అధ్యాపకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం యూనివర్సిటీ నిబంధనల ప్రకారం కళాశాలలను నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయులను తయారు చేయాలని సూచించారు. ఉపాధ్యాయ శిక్షణ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. కళాశాలలో విద్యార్థుల హాజరు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మౌళిక వసతులు కల్పించాలని, నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అకడమిక్ అడిషన్ డైరెక్టర్ ప్రశాంతి, ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి పాల్గొన్నారు.

వీల్‌చైర్ క్రికెటర్ సురేశ్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న ధనావత్ సురేశ్

తిరుమలగిరి(సాగర్), డిసెంబర్ 4: మండలానికి చెందిన ధనావత్ సురేశ్ బెస్ట్ పారా స్పోర్ట్స్ వీల్‌చైర్ క్రికెటర్ అవార్డును అందుకున్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య సురేశ్‌కు అవార్డు అందించారు.

గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కమిటీ ఎన్నిక

అడవిదేవులపల్లి, డిసెంబర్ 4: గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మండల గౌరవాధ్యక్షుడిగా డి.విద్యాచందర్‌నాయక్, అధ్యక్షుడిగా ఆంబోతు నాగానాయక్, ప్రధాన కార్యదర్శిగా కొర్ర శ్రీనునాయక్, ఉపాధ్యక్షులుగా పి.మౌనిక, పి.భగవాన్‌నాయక్, కోశాధికారిగా ఎన్.విజయలక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బాణావత్ సైదులునాయక్, తిరుపతినాయక్, బాషానాయక్, కొర్ర కృష్ణకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు

మాజీ సీఎం కేసీఆర్‌తో చేతన్‌కుమార్

కేతేపల్లి, డిసెంబర్ 4 : బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు వంటల చేతన్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కేసీఆర్ సూచించినట్లు చేతన్ విలేకరులకు తెలిపారు.

హోండా అమేజ్ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

హోండా అమేజ్ కారు ఆవిష్కరణ

నల్లగొండ రూరల్, డిసెంబర్ 4 : నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు మర్రిగూడ సమీపంలో గల ప్రైడ్ హోండా షోరూంలో కొత్తగా వచ్చిన హోండా అమేజ్ వాహనాన్ని బుధవారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెరెడ్డి, ప్రైడ్ హోండా నల్లగొండ బ్రాంచ్ జీఎం కర్ర దామోదర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కారంపొడితోనే టిఫిన్ పెడుతున్నరు

- ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్న ఆదర్శపాఠశాల హాస్టల్ విద్యార్థినులు

విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబర్ 4 : హాస్టల్‌లో మెనూ పాటించడం లేదు.. టిఫిన్‌లో ఒట్టి కారం పొడి పెడుతున్నరు.. ముక్కపట్టిన బియ్యం తో వండిన అన్నంలో కుళ్లిన కూరగాయలతో చేసిన కూరలు పెడుతున్నరు. అంటూ ఆదర్శపాఠశాల వసతి గృహ విద్యార్థినులు ఎమ్మెల్యే బాలూనాయక్‌కు మొర పెట్టుకున్నారు. మంగళవారం రాత్రి ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలూనాయక్ బుధవారం ఆదర్శపాఠశాలను సందర్శించారు. రెండు గంటలపాటు వారితో ఉండి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వసతి గృహం చుట్టూ గడ్డి పెరగడంతో విష సర్పాలు వస్తున్నాయని, కేర్‌టేకర లేకపోవడం మమ్ములను పట్టించుకునే వారు లేకుండా పోయారని ఎమ్మెల్యేకు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే నాణ్యమైన భోజనం అందించాలని, ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుతో పాటు పాఠశాల ఆవరణంలో మట్టి నింపేందుకు అంచనా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీఓ రమణారెడ్డి, డీఎంహెచ్ఓ శ్రీనువాస్, ఎంఈఓ వెంకటయ్య, తాసీల్దార్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి ఉన్నారు. అనంతరం మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ

విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న పోలె డేవిడ్

నిడమనూరు, డిసెంబర్4 : నిడమనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ జిల్లా చైర్మన్ రేపాల మదన్‌మోహన్ ఆర్థిక సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పోలె డేవిడ్ క్రీడా పరికరాలను అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ జె. గోపాల్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా చైర్మన్ పాంపాటి శ్రీనివాసులు, క్లబ్ కార్యదర్శి చిత్రం అశోక్, మెరుగు మధు, గొల్లపల్లి ప్రభాకర్, పిచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

బెల్లి నాగరాజును సన్మానిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 4 : యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండకు చెందిన బెల్లి నాగరాజు యాదవ్‌ను నియమించారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బెల్లి నాగరాజు యాదవ్‌కు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, పల్లెబోయిన కాశీరాం, బొబ్బలి గోపాల కృష్ణ, వంగూరి లక్ష్మీనారయణ, ఎల్‌వీ యాదవ్, అల్లి సతీశ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా వెంకన్న

పామనగుండ్ల వెంకన్నను సన్మానిస్తున్న సంఘం డైరెక్టర్లు

గుర్రంపోడు, డిసెంబర్ 4: గుర్రంపోడు పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా పామనగుండ్ల వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఎన్నికల అధికారి మురళీచారి సమక్షంలో డైరెక్టర్లంతా వెంకన్నను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చనమల్ల యాదవరెడ్డి, సీఈఓ సాయికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివకుమార్, శంకర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను కారు ఢీకొని వ్యక్తి మృతి

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్4 : ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని అద్దకి-నార్కట్‌పల్లి రహదారిపై గూడూరు సమీపంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ పిల్లి లోకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా చిలుకలూరిపేటకు చెందిన షేక్ నసీర్ తన మిత్రుడు నాగభైకవ సీతారామరాజుతో కలిసి హైదరాబాద్ నుంచి కారులో చిలుకలూరిపేటకు బయల్దేరారు. మిర్యాలగూరు సమీపంలోకి రాగానే ట్రాక్టర్ డ్రైవర్ అకస్మాత్తుగా ఎడమ వైపునకు తిప్పడంతో వెనుక నుంచి వస్తున్న కారు ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో డ్రైవర్ పక్కన కూర్చున్న షేక్ నసీర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నల్లగొండ దావఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నసీర్ తండ్రి షేక్ నాగుల్‌మీరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి: రామకృష్ణ

మర్రిగూడ, డిసెంబర్4 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావును ఎదుర్కోలేకే సీఎం రేవంత్‌రెడ్డి ఆయనపై కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకొని ప్రజలకిచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బాలం నర్సింహ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాపోలు యాదగిరి, నాయకులు ఆంబోతు లక్ష్మయ్య, కొండాపురం నరేశ్, మాద సత్తయ్య పాల్గొన్నారు.